ప్రజాశక్తి

శుక్రవారం 19 మే 2023 | 5 | అనంతపురం





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మే 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పరీక్షల సన్నద్ధతపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి వెళ్లేలా బస్సులు నడపాలన్నారు. ఇప్పటికే బస్సు సౌకర్యం లేని పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బస్సులు వేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గత పరీక్షల నిర్వహణ నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోని సిబ్బందితో సహా ఎవ్వరికీ సెల్ ఫోన్లు అనుమతి ఉండకూడదన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా సిబ్బంది ఉండాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద అత్యవసర వైద్యానికి సిబ్బందిని నియమించాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాలవద్ద జిరాక్స్ సెంటర్స్‌ని ఆ సమయంలో మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ సురేశ్ బాబు, డివిఈవో వెంకటరమణ నాయక్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఏవో వెంకట్రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ పరీక్షలకు 50,076 మంది హాజరు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్ -2023 పరీక్షలకు గురువారం 50,076 మంది విద్యార్థులు హాజరైనట్లు ఛైర్మన్ జి.రంగజనార్ధన, కన్వీనర్ సి.శోభాబిందు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 48,896 మంది విద్యార్థులు రిజిష్టర్ చేసుకోగా 46,494 మంది హాజరై 95.09 శాతం, తెలంగాణలో 4,348 మంది విద్యార్థులు రిజిష్టర్ చేసుకోగా 3,582 మంది హాజరై 82.38 నమోదైనట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో 50,076 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.


జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ 4వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్ ఫలితాలను ప్రిన్సిపాల్ పి.సుజాత గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీటెక్ 4వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్ పరీక్షలకు 440 మంది హాజరవ్వగా 424 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 96.36 శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలకు సంబంధిత రీకౌంటింగ్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం నుంచి వీటికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్ భవాని, అన్ని విభాగాల అధిపతులు, పరీక్ష విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ నేతన్న నేస్తం ఏటా సన్నగిల్లుతోంది. ఏడాదికేడాది లబ్ధిదారుల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూపోతోంది. వ్యవసాయం తరువాత అత్యధికంగా ఆధారపడిన రంగం ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేనేత. సుమారు ఐదు లక్షల వరకు ఈ రంగం ఆధారపడి జీవనం సాగించేవారు. ఇటీవల చేనేత రంగం పవర్ లూమ్స్ దెబ్బతో కుదేలు అయ్యింది. వృత్తిలో ఆదాయం లేక అనేక మంది ఈ రంగం నుంచి బయటకు పోతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ సహకారం ప్రోత్సాహం తగ్గుతూవస్తోంది.





సన్నబడుతున్న నేతన్ననేస్తం

- ఏటా తగ్గుతున్న లబ్ధిదారులు
- నిబంధనల పేరుతో కొర్రీలు
- ఎన్నికల ముందు ఒకలా.. తర్వాత మరోలా..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకమునుపు చేనే పట్టు కొనుగోళ్లకు రాయితీ ఉండేది. వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక ఆ రాయితీని ఎత్తివేసి ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలను వైఎస్ఆర్ నేతన్న నేస్తం పేరుతో అందించే పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద చేనేత కుటుంబానికి సంవత్సరానికి రూ.24వేలను రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. ప్రారంభమైన నాలుగు సంవత్సరాల్లో చూస్తే ఈ పథకం కింద లబ్ధిపొందుతున్న వారి సంఖ్య తగ్గుతూపోతుండటం గమనార్హం.

అనంత పరిధిలో నాలుగేళ్లలో తగ్గిన లబ్ధిదారులు 2274 మంది

అనంతపురం జిల్లా పరిధిలో నాలుగేళ్ల కాలంలో చూస్తే లబ్ధిదారుల సంఖ్య ఏకంగా 2274 మంది తగ్గిపోయింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 10525 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.25.26 కోట్లు మంజూరయ్యాయి. 2020-21 సంవత్సరంలో 8821 మంది లబ్ధిదారులు తగ్గిపోయారు. రూ.21.17 కోట్లు మంజూరయ్యింది. 2021-22 సంవత్సరంలో 7360 మంది లబ్ధిదారులకు రూ.17.66 కోట్లు నేతన్న నేస్తం సాయం అందించారు. 2022-23వ సంవత్సరంలో 8251 మంది లబ్ధిదారులకు రూ.19.80 కోట్లు అందజేశారు. ప్రారంభమైన సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చూస్తే లబ్ధిదారలు సంఖ్య సుమారు 22 శాతానికిపైగా తగ్గడం గమనార్హం.

సత్యసాయి జిల్లాలోనూ తగ్గుముఖమే

అనంతపురం జల్లాలో కంటే సత్యసాయి జిల్లాలో చేనేత కార్మికులు అధికంగానున్నారు. ప్రధానంగా ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం ప్రాంతాల్లో చేనేత మగ్గాలు అధికంగానున్నాయి. ఈ జిల్లాలో 2019-20 సంవత్సరంలో 16813 మంది చేనేత కార్మికులకు రూ.40.35 కోట్లు నేతన్న నేస్తం అందింది. అదే 2020-21 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి లబ్ధదారుల సంఖ్య 14,640 కి తగ్గింది. వీరికి రూ.35.14 కోట్లు నిధులు అందజేశారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 14,244 మంది లబ్ధిదారులకు రూ.34.14 కోట్లు మంజూరు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 14,973 మంది లబ్ధిదారులకు రూ.35.93 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇలా నాలుగేళ్లలో రెండు జిల్లాల పరిధిలోనూ 4114 లబ్ధిదారులు తగ్గిపోయారు. ఇలా ఏటా లబ్ధిదారులు తగ్గిపోతూ ఉన్నారు. దీనికి అధికారులు వివిధ కారణాలు చూపుతుండటం గమనార్హం. చేనేత కార్మిక సంఘం నాయకులు మాత్రం చేనేతలందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నరు. బాడుగ మగ్గాల మీద అనేక మంద నేస్తున్నారని, వీరందరికీ ఈ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు రాక... పనులు జరక్క..!

- సిబ్బంది మధ్య సమన్వయలోపం
- బిల్లుల చెల్లింపునకు ఆన్‌లైన్ అప్లోడ్ చేయడంలో నిర్లక్ష్యం
- అకౌంట్స్ విభాగంలో సిబ్బంది కొరత
- దిగజారిన 'అనంత' కార్పొరేషన్ పరిపాలన



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థలో లక్షలాది రూపాయలు వెచ్చించి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల మాట అటుంచి కనీసం వాటికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో కూడా అప్లోడ్ చేయని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లు అభివద్ధి పనులు చేయటం ఒక ఎత్తైతే చేసిన పనుల ఎంబుక్ రికార్డింగ్ మొదలుకుని బిల్లుల అప్లోడ్ వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో బిల్లులు అప్లోడ్ కాక నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్‌లో కీలక విభాగమైన అకౌంట్స్ సెక్షన్లో సీనియర్ గుమస్తాగా ఆరు నెలలు విధులు నిర్వహించిన ఓ ఉద్యోగి కలెక్షన్లు తప్పించి బిల్లుల అప్లోడ్‌పై దృష్టి సారించలేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ఐదు నెలల కాలానికి బిల్లులు వెనక్కి తిప్పికొట్టే రీఅప్లోడ్ చేయాలని ఆదేశిస్తోంది. అధికారులు బిల్లులు పెట్టేసరికి ఐదు నెలలు గడిచిపోతుండడంతో మళ్లీమళ్లీ వాటిని సిఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ బిల్లుల అప్లోడ్‌కు సంబంధించి అకౌంట్ సెక్షన్లో ఒక్కరిపైనే అధిక పని భారం పడటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకవైపు బిల్లుల అప్లోడ్, మరోవైపు వార్షిక అకౌంట్స్ వివరాలను ఆడిట్‌కు తయారు చేసి ఇవ్వటం సదరు ఒక్క ఉద్యోగికి క్లిష్టతరంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారిని విధుల్లోకి తీసుకోవడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కార్పొరేషన్‌లో స్పష్టంగా కన్పిస్తోంది. కాంట్రాక్టర్లు కష్టపడి బిల్లులను అప్లోడ్ చేయించినా మాన్యువల్ సంతకాలు అయితేనే పూర్తి స్థాయి బిల్లుల మంజూరుకు అనుమతి లభిస్తుంది. ఈ మాన్యువల్ సంతకాల పనులు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయి. గడచిన ఏడాది కాలంగా బిల్లుల ఆన్లైన్ అప్లోడ్ జరిగిన వాటిని త్వరితగతిన మంజూరు చేయకుండా ఉన్నతాధికారి పరిశీలన పేరుతో ఆపేసి కాలయాపన చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదే విషయంపై కార్పొరేషన్ స్థాయీ సంఘం సమావేశాల్లో కాంట్రాక్టర్ల అధికారులను పలుమార్లు నిలదీశారు. ఆ సమయంలో ఇకపై జాప్యం లేకుండా చూస్తామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వటమే తప్పా, ఆచరణలో చేసింది ఏమీలేదనే చెప్పాలి. చేసిన పనులకు బిల్లులను త్వరితగతన ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి, సిఎఫ్ఎంఎస్‌కు పంపితే రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయడం కష్టం అయిన తరుణంలో అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం కాంట్రాక్టర్ల పాలిట శాపంగా మారింది. సీనియార్టీ ప్రకారం బిల్లులు చెల్లించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదని వాపోతున్నారు. బిల్లుల చెల్లింపు విషయమై పాలకవర్గం సైతం తూతూమంత్రంగా సమీక్ష సమావేశాలు జరిపి చేతులు దులుపుకుంటోంది. ఓ వైపు అధికారులు, మరో వైపు పాలకవర్గం నిర్లక్ష్యం నడుమ బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఇబ్బందులపాలవుతున్నారు.

అకౌంట్స్... సెక్షన్ ఎగ్జామినర్ నడుమ సమన్వయలోపం..?

అనంతపురం నగరపాలక సంస్థలో అకౌంట్స్ సెక్షన్, ఎగ్జామినర్ మధ్య సమన్వయలోపం కారణంగా కిందిస్థాయి ఉద్యోగులు, కాంట్రాక్టర్స్ నలిగిపోతున్నట్లు తెలుస్తోంది. వీటిని సరి చేయాలని అటు ఉద్యోగులు, కాంట్రాక్టర్స్ ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ దష్టికి తీసుకెళ్లారు. అయితే ఆయా విభాగాల అధికారుల ఒట్టెద్దు పోకడలను నివారించాల్సిన ఉన్నతాధికారి మౌనం వహించడంపై కింది స్థాయి ఉద్యోగులు అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. అకౌంట్స్ విభాగం నుంచి పంపిన ప్రతి ఫైలుపై ఎగ్జామినర్ కొర్రీలు వేస్తున్నట్లు సమాచారం. కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు పనులు చేస్తున్నామని చెబితే, కమిషనర్‌కి ఏం అధికారం ఉందని సదదరు ఎగ్జామినర్ ఎదురు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కాంట్రాక్టర్లు, ఉద్యోగులు కమిషనర్ దష్టికి ఇప్పటికే తీసుకెళ్లారు. అయినా శాఖల మధ్య నెలకొన్న సమన్వయలోపం మాత్రం కొలిక్కిరావడం లేదు. ఇటీవల ఒక టెండర్‌కి సంబంధించి డిమాండ్ డ్రాఫ్ట్ వివరాలను నమోదు చేయగా వాటి కాపీ ప్రతులను సమర్పించిన తరువాత కానీ వాటిని పరిశీలించడం జరగదని సదరు అధికారి పేర్కొన్నారు. దీంతో డిడి ఫొటో సాఫ్ట్‌కాపీని జతపరిచిన తరువాతే ఆ ఫైల్‌కు ఆమోదముద్ర పడింది. ఈసమస్యలన్నింటికీ కారణం అకౌంట్స్ సెక్షన్, ఎగ్జామినర్ నడుమ సమన్వయ లోపమా.? లేక విభేదాలా.? అన్న అంశం తెలియక మధ్యలో కాంట్రాక్టర్లు నలిగిపోతున్నారు. ఈ సమస్యపై కమిషనర్ రమణారెడ్డి స్పందిస్తూ స్వయంగా అధికారులతో మాట్లాడి సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఏదిఏమైనా కార్పొరేషన్‌లో అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఓ బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్లు, మరో వైపు కింద స్థాయి ఉద్యోగులు స్వేచ్ఛగా విధులు నిర్వహించలేక ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి శాఖల మధ్య సమన్వయం కదుర్చే చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లు, కింది స్థాయి ఉద్యోగులు కోరుతున్నారు.

రెజ్లర్ల ఆవేదనను పట్టించుకోరా.?

- ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి
- ప్రజాసంఘాల డిమాండ్
- అనంతలో కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టర్

బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని రెజ్లర్ల గత 25 రోజులుగా ఢిల్లీలో నిరసన తెలుపుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి పట్టదాని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం అనంతపురం క్లాక్ టవర్ నుంచి రఘువీరా టవర్స్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు కాగడాల ప్రదర్శనను సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్ర కుమార్, డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా గత 25 రోజులుగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లను తక్షణమే పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితుడిగా ఉన్న బిజెపి ఎంపీ, రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్జిభూషణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించాలన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తితో ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల పట్ల అసభ్యంగా, ప్రవర్తించిన ఢిల్లీ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజాసంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పతకాలు సాధించినప్పుడు ఇంటికి పిలిచి ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి మోడీ నేడు రెజ్లర్ల సమస్య పట్ల ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. మహిళలకు రక్షణ కల్పించలేని బిజెపికి రాబోయే ఎన్నికల్లో తగ్గిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రెజ్లర్లకు న్యాయం చేయకుంటే ఆందోళనను మరింత ఉధృం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, రామాంజనమ్మ, నరసింహారెడ్డి, వ్యకాసం జిల్లా కార్యదర్శి కష్ణమూర్తి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, సిఐటియు నాయకులు వెంకట్ నారాయణ, ఏటీఎం నాగరాజ్, ఆవాజ్ ముస్కిన్, లక్ష్మీనరసమ్మ ఎర్రిస్వామి, మంత్రి వరలక్ష్మి, తిరుమలేష్, శ్రీనివాసులు, బాలకష్ణ, ఆదినారాయణ, ఆజాం, శివప్రసాద్ పాల్గొన్నారు.

సాకారమైన 16ఏళ్ల పేదల కల

సిపిఎం పోరాటాల ఫలితంగా ఇళ్ల పట్టాలు పంపిణీ-ధన్యవాదాలు తెలిపిన కాలనీ ప్రజలు



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కాయాకష్టం చేసి నిర్మించుకున్న ఇళ్ల పట్టాలివ్వాలని 16 సంవత్సరాలుగా నిరీక్షిస్తున్న శ్రీశ్రీ కాలనీ పేదల కల ఎట్టకేలకూ సాకారమైంది. సిపిఎం నిర్విరామ పోరాటాల ఫలితంగా నియోజకవర్గం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో గురువారం శ్రీశ్రీ నగర్‌లోని 272 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి పేదల పక్షపాతి ప్రభుత్వం అన్నారు. సిఎం జగన్ పేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా నియోక వర్గంలో ఎప్పటి నుంచో శ్రీశ్రీ కాలనీ ప్రజలు పట్టాల కోసం ఎదురు చేశారన్నారు. గతంలో రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమం సందర్భంగా శ్రీశ్రీ నగర్‌కు వచ్చినప్పుడు కూడా ప్రజలు తమ కష్టాలు తెలిపారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇళ్ల పట్టాలు మంజూరు చేసి హామీని నిలబెట్టుకున్నామన్నారు. అంతేగాకుండా ఈ కాలనీలో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీశ్రీ నగర్‌లో బ్రిడ్జిని నిర్మించామన్నారు. భవిష్యత్తులో బ్రిడ్జి వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపోతే ఇళ్ల పట్టాల కోసం సిపిఎం, వామపక్ష పార్టీలు పోరాటం మరువలేనిదన్నారు. వారి పోరాటాల్లో తాను కూడా ప్రత్యక్షంగా పరోక్ష్యంగా భాగస్వామి అయ్యాయని గుర్తు చేశారు. ఇళ్లపట్టాలు పొందిన వారు ఇళ్లు నిర్మించుకోవాలనుకుంటే రూ.1.80 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ మూడు ప్రభుత్వాలు మారినా పేదలకు పట్టాలు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆందోళన పడుతున్న పేదలకు పట్టాలు ఇచ్చి ఆనందం నింపారన్నారు. ప్రజల తరుపున ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తమ పక్షాన పోరాటాలు చేసిన సిపిఎం నాయకత్వానికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతిసాహిత్య, కార్పొరేటర్ మునిశేఖర్, రాజీవ్ కాలనీ మాజీ సర్పంచి హుసేన్, వైసిపి నాయకులు మధన్‌మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మసూద్, ఎంపిటిసి రమీజాబి, సిపిఎం నాయకులు ప్రకాష్, వలి, బాబు, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన



సిఐ ఆనందరావుతో వాగ్వివాదం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు అధికారులు, పాలకులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి వాపోయారు. గురువారం తాడిపత్రి పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా కౌన్సిల్ సమావేశ భవనాన్ని ముట్టడించారు. ముందుగా పాత పురపాలక సంఘం కార్యాలయం నుంచి సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు ర్యాలీగా మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న చోటుకు వెళ్లేందుకు యత్నించారు. అయితే విషయం తెలుసుకున్న సిఐ ఆనందరావు అడ్డుకుని ర్యాలీని అనుమతించేది లేదని చెప్పారు. దీంతో సిఐటియు నాయకులు సీఐతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం సిఐటియు నాయకులు డిఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించిన డీఎస్పీ ర్యాలీకు అనుమతించారు. అనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేకమార్లు అధికారుల, పాలకుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మున్సిపల్ రెగ్యులర్ కార్మికులకు రెండు సంవత్సరాల సరెండర్ లీవ్‌లు ఇవ్వాలని, కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫాం, చెప్పులు పంపిణీ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సకాలంలో హెల్త్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తర్వాత మున్సిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి : ఎమ్మెల్యే అనంత

అనంతపురం : నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం ఎస్పీడీసీఎల్ ఎస్ఇ సురేంద్ర ఛాంబర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు మార్చాలని 307 ఫిర్యాదులు అందితే సుమారు 156 పరిష్కారం అయ్యాయని, మిగిలిన వాటిపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా రాణినగర్, అంబేద్కర్ నగర్, పాతూరు ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో డ్యామేజ్ పోల్స్‌ను గుర్తించి మార్చాలని సూచించారు. అలాగే రుద్రంపేట, నారాయణపురంలో విద్యుత్ స్తంభాలు డ్రెయినేజీల్లో ఉన్నాయని, తక్షణం మార్చాలని సూచించారు. జూన్ నాటికి గ్రీవెన్స్ అన్ని పూర్తి చేయాలన్నారు.

పేద రైతులకు వరం వైఎస్ఆర్ జలకళ

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి


రైతులకు మోటారు, పెంపుసెట్లను పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

పేద రైతులకు వైస్సార్ జలకళ పథకం ఓ వరంలాంటిదని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. గురువారం మండల పరిధిలోని షేక్షానుపల్లిలో గ్రామంలో వైఎస్ఆర్ జలకళ పథకం కింద బోరు వేసిన రైతులకు ఉచితంగా మోటారు పంపుసెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన దాదాపు 98 శాతం హామీలు అమలు చేశారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన చిన్న, సన్నకారు రైతులకు 'వైఎస్ఆర్ జలకళ'లో భాగంగా బోరు మొదలుకుని పంపుసెట్లు,మోటార్లు,ఇతర సామగ్రి కింద దాదాపు రూ.5లక్షల వరకు ఉచితంగా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, జెడ్పిటిసి పార్వతమ్మ, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, ఎపిడి జయకుమార్, ఎపిఒ శైలజ, అమిద్యాల సర్పంచి శ్రీరాములు, ఎంపిటిసి ఓబన్న, సచివాలయ కన్వీనర్లు వెంకటేష్‌నాయక్, శ్రీనివాసులు, నాయకులు నాగభూషణ, అయ్యప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన


వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వేసవికాలంలో తగిలే వడదెబ్బపై మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సిహెచ్ఒ నాగ రంగయ్య గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్న నేపథ్యంలో వడదె బ్బ తగిలే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలు ఉదయం 10 నుంచి 4 గంటల వరకు ఎండల్లో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే కాలికి చెప్పులు ధరించి, తలకు టోపీగానీ, రుమాలు ధరించాలన్నారు. పలుచటి నూలు దుస్తులు ధరించాలని, నల్లటి దుస్తులు ధరించారాదని తెలిపారు. ఎవరికైనా తలనొప్పి, తలతిరగడం, అధిక జ్వరం, నీరసం, నాలుక ఎండిపోవడం, మగతగా ఉండడం, స్పృహ కోల్పోవడం వంటివి వడదెబ్బ లక్షణాలన్నారు. ఆ లక్షణాలు కనిపిస్తే వెంటనే అతనికి నీడపాటున చేర్చి దుస్తులు వదులుగా చేసి విసన కర్రతో విసరాలన్నారు. తర్వాత వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, స్వర్ణలత, సచివాలయ ఎఎన్ఎం పద్మావతి, సీఓ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

రాయదుర్గం : నియోజకవర్గంలోని గుమ్మగట్ట మండలంలో రెండు రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.26 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఈమేరకు రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న నిధులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. రూ.13 కోట్లతో రాయదుర్గం నుంచి గొల్లపల్లి, గలగల, తాళ్లకెర మీదుగా బిటి ప్రాజెక్టు వరకు, మరో రూ.13 కోట్లతో రాయదుర్గం నుంచి భూపసముద్రం వరకు రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేగా కాపు రామచంద్రారెడ్డి విఫలం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించడంలోను ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఘోరంగా విఫలం చెందాడని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. గురువారం పట్టణంలోని 25, 26, 27వ వార్డుల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే కాపు పనితీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి ఎదురైన ఛీత్కారాలే ఇందుకు నిదర్శమన్నారు. అదే టిడిపి నిర్వహిస్తున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఇకపోతే లోకేష్ 100 రోజుల పాదయాత్రకు సంఘీభావంగా ఇటీవల 75- వీరాపురం నుంచి రాయదుర్గం వరకు వందలాది మందితో చేసిన ఆరు కిలోమీటర్ల పాదయాత్ర ద్వారా ఎమ్మెల్యే 'కాపు'నకు మతి భ్రమించిందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఘోర పరాజయం తప్పదన్నారు. వార్డులో తిరిగినప్పుడు జగన్ స్టిక్కర్ అతికించుకున్న ప్రతి ఇళ్లు నన్ను ఆదరిస్తోందన్నారు. వాలంటీర్లు, వైసీపీ నాయకులు బలవంతంగా ప్రజల ఇళ్లకు జగన్ స్టిక్కర్లు అతికిస్తున్నారని స్పష్టంగా గ్రహించామన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చిన టిడిపిని గెలిపించడానికి, వైసీపీని భూస్థాపితం చేయడానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. రాష్ట్రం బాగుండాలి, ప్రజలు బాగుండాలంటే, ముఖ్యంగా మహిళల సంక్షేమం కోసం మళ్లీ రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవస్థలను నాశనం చేసిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసి నియంత పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి విమర్శించారు. గురువారం టిడిపి నియోజకవర్గం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన ఇదే ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ప్రజలు సమస్యలపై ఫిర్యాదులు నిదర్శనంగా నిలిచాయని తెలిపారు. 84,145 మిస్ట్ కాల్స్, 40,130 ఫిర్యాదులు వచ్చాయంటే ప్రభుత్వ తీరుపై ప్రజలు ఎంత ఆందోళన పడుతున్నారో తెలుస్తోందన్నారు. నగరంలో డిసెంబర్ 2 నుంచి నాలుగు పంచాయతీలు, 50 డివిజన్లో ఇదేం కర్మ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించిందన్నారు. ఏ ప్రభుత్వమైనా కులమతాలకు అతీతంగా పని చేయాలని, కానీ జగన్ ప్రభుత్వం విపక్షతో పని చేస్తుందన్నారు. పలు పెన్షన్లు రేషన్ కార్డులు, పించన్‌లు తొలగించారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. తమ హయాంలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు వివరించామన్నారు. దేశంలో ఎక్కడ మాదకద్రవ్యాలు కనిపించినా దానికి మూలాలు ఏపీలోనే కనిపిస్తున్నాయన్నారు. అస్తవ్యస్త పాలలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పక్షం లేకుండా చేయాలని ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తూ ప్రతిపక్షాలను అణగదొక్కుతోందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమంలో అనంతపురం నియోజకవర్గం రికార్డ్ సృష్టించిందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ప్రభుత్వం రాగానే వాటినన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయఢంకా మోగిస్తుందన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు


ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కుర్లపల్లి గ్రామానికి మహిళలు ఖాళీ బిందెలతో గురువారం రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 15 రోజుల నుంచి నీరు రావడం లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. అధికారులు వచ్చి వెంటనే సమస్య పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించేది లేదని భీషించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జనార్ధన ఘటనా స్థలానికి చేరుకుని పంచాయతీ అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అంతేగాకుండా వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వీరి ఆందోళనకు సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామకృష్ణ, కుర్లపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఈతకెళ్లి వ్యక్తి మృతి


మృతిచెందిన మల్లికార్జున

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని చాపిరి గ్రామంలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లికార్జున (38) వ్యవసాయ దొడ్డిలో గడ్డివామి వేశాడు. అనంతరం వ్యవసాయ తోటలో తొట్టెలోకి తన కొడుకుతో కలిసి ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ మల్లికార్జున లోపలికి వెళ్లి ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో ఆందోళన చెందిన కొడుకు పక్క తోటలోని వ్యక్తులను తీసుకొచ్చాడు. హుటాహుటిన వారు వచ్చి మల్లికార్జునను బయటకు తీసి ఆటోలో కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

మొక్కజొన్న పంట దగ్ధం

యాడికి : గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పుతో టిడిపి నాయకుడు గండికోట లక్ష్మణ్‌కు చెందిన మొక్కజొన్న పైరు పాక్షికంగా కాలిపోయింది. కోతకు సిద్ధంగా ఉన్న పైరు నూర్పిడి చేయించడానికి ఓ యంత్రం కూడా సాయంత్రం రావాల్సి ఉంది. ఇంతలో ఈ ఘటన చోటు చేసుకుందని బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులో చేశారు. విషయం తెలుసుకున్న క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు పరిమి చరణ్ తదితరులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

గుత్తి బీసీ కాలనీలో చోరీ

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం అర్ధరాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన షేక్ బాషా సిగరెట్లను హోల్‌సేల్‌గా విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువాను బద్దలు కొట్టి అందులోని విలువైన వస్తువులు, ఓ గదిలో ఉన్న రూ.లక్ష విలువజేసే సిగరెట్ బండిళ్ళను చోరీ చేశారు. అలాగే ఇంటి వద్ద పార్కింగ్ చేసిన వ్యాగనర్ కారును అపహరించుకు వెళ్లారు. ఉదయం లేచి వచ్చి గమణించిన షేక్‌బాషా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వైసిపి సీనియర్ నాయకుడు మృతి

బెలుగుప్ప : మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన వైసిపిపి సీనియర్ నాయకుడు, ఉపసర్పంచి చిలకల పెద్దరెడ్డి (58) గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి నక్కలపల్లి గ్రామానికి చేరుకుని పెద్దిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి అండగా ఉంటూ ఎన్నోసేవలు చేశారని కొనియాడారు. అలాంటి వ్యక్తి గుండెపోటుతో మరణించడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఊరువాకుల రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, శివలింగప్ప, నరిగన్న, పాతన్న, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న జంగం అంకన్న వైద్యం కోసం నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో అంకన్నకు కాలు విరిగింది. ఈనేపథ్యంలో ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ముంటిమడుగు కేశవరెడ్డి స్థానికుల ద్వారా సమస్యను తెలుసుకుని ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మదమంచి ప్రతాప్‌చౌదరి, తిప్పన్న, రంగాపురం శ్రీరాములు, నరసాపురం శివరామకృష్ణ, ఆకుల లక్ష్మీనారాయణ, గూగూడు కొల్ల ఓబులేసు, మల్లెల కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

నార్పల : మండల పరిధిలోని మూగేతిమ్మంపల్లి గ్రామంలో వెలసిన శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టాపనకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు గురువారం రూ.60వేలు ఆర్థికసాయం చేశారు. ముందుగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పిట్టు రంగారెడ్డి, కన్వీనర్ ఎర్రినాగప్ప, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామమూర్తి, రైతు అధికార ప్రతినిధి రాజగోపాల్, వెంగల్‌రెడ్డి, శేఖర్, సురేష్, రాజేష్, కిషోర్, సురేష్, రమేష్, రాజశేఖర్, ప్రసాద్, నవీన్, బ్రహ్మ, నాగేంద్ర, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

రాయదుర్గం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాలపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖ పురోగతి, విద్యుత్, ఉద్యానవన శాఖలు, తాగునీరు, స్పందన, జగనన్నకు చెబుదాం వంటి అంశాలపై తహశీల్దార్ మారుతీ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి రఘు రాంరావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శివశక్తి ఆలయంలో సీతారామ కళ్యాణం

అనంతపురం : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని తపోవనంలో శివశక్తి సాయి ఆలయంలో చేపట్టిన వేడుకల్లో భాగంగా గురువారం సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం నుంచి ప్రారంభమైన వేడుకల్లో భాగంగా 4రోజులపాటు వేదాద్రి ప్రవీణ్‌కుమార్ శర్మ పర్యవేక్షణలో సుదరకాండ పారాయణం చేశారు. గురువారం సుదరకాండ ముగింపు సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వహించిన అనంతరం శాస్త్రోక్తంగా పట్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ విధానంద స్వామి, సాయిసంస్థ అధ్యక్షుడు విజయ సాయికుమార్, ఆలయ కమిటీ శ్రీరాములు, దేవేంద్ర, కోదండ రామ భక్త బృందం, సాయి సంస్థ సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

నార్పల : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక దుర్మార్గపు పాలన పాలన సాగుతోందని టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు విమర్శించారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని బొందలవాడ గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా పాలన సాగిస్తుండటంతో ప్రజలందరూ అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా అంతులేని అవినీతి, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల, ఇసుక కొరత, పెరిగిన సిమెంటు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, ఇష్టానుసారంగా పెంచిన కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, బస్సుఛార్జీల పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అరాచకపు పాలన పోవాలంటే రానున్న ఎన్నికల్లో తప్పనిసరిగా టిడిపిని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి కుళ్లాయప్ప, నాగభూషణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కరణం సోమశేఖర్, సోషల్ మీడియా అధ్యక్షుడు దాసరి రాము, దిగ్గిమి చంద్రమౌళి, వార్డు సభ్యులు యక్కలూరి బయన్న, తలారి ఆదినారాయణ, దాసరి కృష్ణయ్య, యక్కలూరి ఆదెప్ప, సూరి, యక్కలూరి సాయి, మల్లేశు, షేక్షావలి, వంశీ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.


'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

నకిలీ విత్తనాలు, ఎరువులపై దృష్టి సారించాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ కమిషనర్ గారి అదేశాల జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్ అధ్యక్షతన గురువారం స్థానిక రెవెన్యూ భవన్ సమావేశ హాలులో ఉమ్మడి అనంతపురం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులతో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతోపాటు చట్టాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కమిషనరేట్ జెడిఎ కృపాదాస్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా కోసం ప్రభుత్వము చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తరచూ ఎరువుల దుకాణాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, కమిషనరేట్ ఎడిఎలు రాజన్, సుదర్శన్‌రాజు, మద్దిలేటి, సురేష్‌రెడ్డి, రెండు జిల్లాల సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభం

పుట్లూరు : మండలంలోని కందికాపుల, కోమటికుంట్ల, తక్కల్లపల్లి సచివాలయాలతోపాటు రైతుభరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, ఎంపిడిఒ యోగానందరెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న శ్రీచైతన్య కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వాపారంగా మలుచుకున్నాయన్నారు. ముఖ్యంగా నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే అడ్మిషన్లు ప్రారంభించాయన్నారు. ఈ విషయం తెలిసినా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల పేరుతో, కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు విక్రయించకూడదన్నారు. అయినప్పటికీ అన్ని విద్యా సంస్థల్లో విక్రమిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాసంస్థలు చేస్తున్న విద్యామాఫియాను అరికట్టాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మరిన్ని పోరాటాలకు స్వీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివా, రాజేష్, చంద్ర, ముస్తఫా, ఎఐఎస్‌బి నాయకులు నాగార్జునరెడ్డి, మారుతి, ధనుష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు అభి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జూన్ 2, 3, 4వ తేదీల్లో విశాఖపట్నం నగరంలో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలక్రిష్ణ, నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యువజన సంఘం డివైఎఫ్ఐ మాత్రమే అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి సంవత్సరానికి రెండు లక్షలు కూడా భర్తీ చేసిన పాపాన పోలేదన్నారు. దేశంలో ప్రధాన ఉపాధి రంగాలైన రైల్వే, రక్షణ రంగాలలో దాదాపు పది లక్షల ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయడంలో మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. డివైఎఫ్ఐ యువజన సంఘం ఒకవైపు నిరుద్యోగ సమస్య పోరాడుతూనే, రెండోవైపు అనేక రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కరోనా సమయంలో ఐసోలేషన్ సెంటర్ ను ఏర్పాటు చేసి వేలాది మందికి సేవలు అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాధిక్ వలి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన కల్పించాలి


హెచ్ఐవి అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హెచ్ఐవి వ్యాధి నియంత్రణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి సూచించారు. గురువారం ప్రంచ హెచ్ఐవి వ్యాధి నియంత్రన టీకా దినోత్సవ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రా అనుబంధ సంస్థలైన ప్రగతి పదం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవిపై అవగాహనకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి రాకుండా అనేక నియంత్రణ చర్యలపై అవగాహన సదస్సులు, అవగాహన కార్యక్రమాలు ప్రజల్లోకి ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, తీసుకెళ్లడం హర్షణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, ప్రగతి పథం సంస్థ అధ్యక్షుడు జయ మారుతి, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు దివ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు ప్రియ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నందిత, జోష్న, ఆజాం, ప్రదీప్, మహేష్, తుకారం, జి.గౌతందీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అటవీ సెక్షన్ అధికారిణి ఎం.ప్లారెన్స్ దీపా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గుత్తి : అటవీ సెక్షన్ అధికారిణి ఎం.ప్లారెన్స్ దీపా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎంవివి పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా పర్యావరణాన్ని కాపాడుకుందామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కావున పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంవీవీ పాఠశాల హెచ్‌ఎం జోస్నా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మహేష్



ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉరవకొండ తాలూకా అధ్యక్షులుగా వసికేరి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ తెలిపారు. గతంలో అధ్యక్షులుగా ఉన్న డాక్టర్ ఎర్రిస్వామిరెడ్డి ఉన్నత చదువులు చదువుకోవడానికి వెళ్లడంతో వసికేరి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నకుంటూ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనమీద నమ్మకం ఉంచి ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ, జిల్లా సెక్రటరీ రామునాయక్, ఉరవకొండ ఎంపిడిఒ చంద్రమౌళితోపాటు సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తారని తెలిపారు.

శ్మశాన వాటికల్లో కంపచెట్ల తొలగింపు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో ఉన్న శ్మశాన వాటికలతోపాటు వెళ్లే దారిలో జెసిబి ద్వారా కంపచెట్లు తొలగించారు. శ్మశాన వాటికలకు రహదారుల ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. గమణించిన ఎంపిపి ఎస్.తిరుపాలమ్మ సమస్యను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో వైసిపి బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్.రాముయాదవ్, నాయకుడు ఎస్.సుధాకర్ యాదవ్ దగ్గరుండి జెసిబితో కంపచెట్లు తొలగించారు.

జెసి పవన్‌ను కలిసిన టిడిపి నేత సుధాకర్

శింగనమల : అనంతపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి జెసి పవన్‌కుమార్‌రెడ్డిని టిడిపి నాయకులు చిన్న జలాలపురం సుధాకర్ గురువారం హైదరాబాదులోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను పవన్‌కుమార్‌తో చర్చించినట్లు సుధాకర్ తెలిపారు.